# సింగిల్ పేజీ కథలు

## హాట్టోకా-ఎగురు

శ్రీవారి బదిలీ పుణ్యమా అని ఆంధ్ర రాజధాని నుంచి సుమారు 3000 కిలోమీటర్ల దూరంలో వున్న మరో రాష్ట్ర రాజధాని గౌహతికి వచ్చి పడ్డాం.

పూర్వోత్తర భారతానికి ఐదు పరాయి దేశాలు సరిహద్దులు కావడంతో ఇక్కడి సంతతి వారంతా కాస్త వింతగా, విడ్డూరంగా కనబడతారు. మన ముక్కూ మొహాలు మచ్చుకి కనబడవు. ఇక్కడి వాతావరణం మరీ విడ్డూరం- గంటకో రకంగా మారిపోతూ వుంటుంది.

శ్రీవారికి బ్యాంకులో ఉద్యోగం. రెండేళ్ళు అవస్థపడితే మళ్ళీ మనం అడిగిన చోటుకి తప్పనిసరిగా బదిలీ చేస్తారని కోరి మరీ గౌహతికి వచ్చాం. బ్రహ్మపుత్రా నదికి నాలుగు మైళ్ళ దూరంలో నివాసానికి మంచి వసతే ఇచ్చారు. కాస్త పోష్ లొకాలిటీ అని చెప్పొచ్చు. ఎత్తైన చోట ఈ కాలనీని కట్టారు. ఊళ్ళోకి వరద వచ్చినా ఇక్కడికి నీరు రాదన్నమాట. బాగా అభివృద్ధి చెందిన ప్రాంతంలోనే ఉంది. చుట్టూ భవనాలు, పార్కులు, వాణిజ్య సముదాయాలు, గవర్నమెంటు ఆఫీసులు ఉన్నాయి.

నాలుగు రోజుల్లో సామానంతా చక్కగా సర్దుకొని, పాపని కనిపెట్టుకొని వుండటానికి ఎవరినయినా చూడమని శ్రీవారికి పురమాయించాను.

ఆయన చాలా బుద్ధిమంతులు. మూడో రోజుకల్లా మొహంతా అనే కుర్రాడ్ని కుదిర్చారు వాళ్ళ కొలీగ్ సాయంతో. మొహంతా కొద్దిగా విచిత్రంగా కనిపించినా ఫరవాలేదనిపించాడు. ఇబ్బందల్లా వాడి భాషే. వాడికి అస్సామీ తప్పితే ఇంకోటి అర్థం కాదు. నాకు తెలుగు, వచ్చీరాని హిందీ తప్ప ఇంకోటి రాదు. కాస్త కష్టమైనా వారం రోజుల్లో అలవాటయ్యింది.

మెల్లిగా బజారుకి వెళ్ళి వెచ్చాలు, కూరగాయలు తెచ్చుకోవడం అలవాటయ్యింది. ఓరోజు గోధుమలు బాగు చేయమని మొహంతాగాడికి చెప్పి మార్కెట్‌కి బయలుదేరాను. మార్కెట్లో బీరకాయలు 'కైసా' అడిగాను.

"కిలో దోస్ టోకా (పది రూపాయలు)" చెప్పాడు కొట్టువాడు.

"ఛే మే దేవో" అని నాకున్న పరిజ్ఞానంతో వాడి సహనాన్ని పరీక్షిస్తున్నాను.

"నాయ్..హట్‌క్కా..లాస్ట్" అన్నాడు. సరేనని ఒక కిలో కొని పది నోటిచ్చాను. వాడు మూడు రూపాయలు తిరిగి ఇచ్చాడు. అదేంటి ఒక రూపాయి ఎక్కువెందుకిచ్చావ్ అంటాను నేను. కరెక్టే అంటాడు వాడు.

అర్థం కాలేదు. చివరికి వాడి చేతిలో రూపాయి పెట్టి ఒక ధనియాముట్టి (కొత్తిమీర కట్ట) తీసుకొని బయటపడ్డాను.

ప్రక్క కొట్లో కేబేజీ బేరం మొదలెట్టాను. నా పోరు, గోడు అర్థంకాక దుకాణం వాడు-

"ఏకీబాత్..ఎగురు" అన్నాడు.

ఒక్కసారిగా అదిరిపడ్డాను. "క్యా" అని గట్టిగా రెట్టించాను.

వాడూ అంతే గొంతుతో "ఎగురో" అన్నాడు. ఎవరయినా విన్నా చూసినా బాగోదు. ఎందుకొచ్చిన తంటా అనుకుంటూ ఇంటిముఖం పట్టాను.

ఇక్కడి వాతావరణంలో పదడుగులు వేసేటప్పటికి, మన విశాఖలో నాలుగు మైళ్ళు నడిచినా పట్టని స్వేదం ఒళ్ళంతా కమ్ముకొంటుంది. చికాగ్గా కాలనీలోకి అడుగుపెట్టిన నాకు మొహంతా ఎదురొచ్చాడు.

"ఏరా గోధుమలు బాగు చేశావా" అభినయిస్తూ అర్థం అయ్యేలా అడిగాను.

వాడు నాకంటే ఎక్కువ అభినయిస్తూ "హాప్ హోగయా మేడం" అన్నాడు.

మొత్తం గోధుమలు సగం చేశాననేటప్పటికి ఉస్సురంటూ "పాపేదిరా" అని తెలుగులో అడిగేశాను.

వాడు బిక్కమొగం వేసాడు.

తప్పు తెలుసుకొని వాడికి అర్థం అయ్యేలా-

"బచ్చీ బచ్చీ.. కహా హై" అన్నాను.

"బచ్చీ హోగయీ మేడం" అంటూ మెల్లగా గొణిగాడు.

ఒక్కసారిగా నా గుండెలవిసిపోయాయి. బచ్చీ హోగయీ అంటున్నాడు.

పాప ఏమన్నా బాల్కనీలోంచి పడిపోయిందా ఏంటి అనుకుంటూ ఒక్క గంతులో ఇంట్లోకి దూకాను. ఇల్లంతా నా కళ్ళు వెతికేశాయి.

పాప హాయిగా నిద్రపోతోంది బెడ్‌రూంలో.

ఒక్కసారిగా మొహంతాగాడ్ని చంపేద్దామా అన్నంత కోపం వచ్చింది. చెడామడా వాడిని తిట్టేశాను. నాకెందుకు అంత కోపం వచ్చిందో వాడికి అర్థం కానట్లుంది. బిక్కచచ్చిపోయి మౌనంగా వుండిపోయాడు.

సాయంత్రం ఈయనగారు ఎప్పుడు వస్తారా అని కాచుక్కూర్చున్నాను. మొహంతా గాడ్ని సాగనంపేద్దామనే నా ఉద్దేశ్యం. ఆయనగారు రాగానే "ఈ పరమానందయ్య శిష్యుడితో పడలేను. వీణ్ని సాగనంపండి" అంటూ జరిగినదంతా ఏకరువు పెట్టాను.

శ్రీవారు తొందరగా రియాక్టుకారు.."ఆగవోయ్..భాషలో ఏదో తిరకాసు వుండి ఉంటుంది. కనుక్కుందాం ఉండు. కుర్రాడ్ని మరీ వాయించేయకు. వాడ్ని చూడు హడిలి చస్తున్నాడు" అంటూ వాడినే వెనకేసుకొచ్చారు.

నేను పట్టువదలలేదు.

"ఈ వ్యవహారంలో తిరకాసు కనుక్కుంటానన్నాను కదా. తొందరపడకు" అంటూ ఎదురు ఫ్లాట్‌లో వుండే హెండిక్ హజారికాగారి (గమ్మత్తుగా వుంది కదూ పేరు. ఇక్కడ వాళ్ళ పేర్లన్నీ అంతేమరి) తలుపుతట్టారు.

ఆయన బయటికి రాగానే మా అనుభవాల్ని వివరించాము. మా యాస, భాష వారికి అర్థం కానట్లుంది. ఆయన మొహంతాగాడ్ని పిలిచి వాడితో ఏదో గల గలా మాట్లాడారు. అంతా విని ఒక్కసారిగా ఆయన పక, పకా నవ్వారు.

ఆయన నవ్వు మాకు చికాకు తెప్పించిన మాట వాస్తవం.

మా ముఖకవళికలు గమనించి నవ్వు నాపుకుని-

"నార్త్ ఈస్ట్‌లో 'స' అనే అక్షరానికి లిపి వుంది కాని, ఉచ్చారణలో 'హ' అని ఉచ్చరిస్తారు. గోధుమలు హాఫ్ అయ్యాయంటే 'సాఫ్' అయ్యాయని, 'బచ్చీహోగయీ' అంటే 'సోగయీ' అని అర్థం" చెప్పారు హజారికాగారు.

ఉదయం మార్కెట్లో హాట్టోకా అంటే 'సాత్ టోకా' ఏడు రూపాయలని అర్థం చేసుకోలేని నా పాట్లని తలుచుకొంటే నాకే నవ్వు వచ్చింది.

మరో సందేహం వచ్చింది.

"కాబేజీ ధర అడిగితే 'ఎగురు' అన్నాడు దాని అర్థం ఏమిటి" అడిగాను.

"ఎగురు కాదమ్మా ఎగొరో అంటే అస్సాం భాషలో పదకొండు అని అర్థం" చెప్పారు హజారికా.

ఊరు కాని ఊర్లో ఏం తిప్పలురా దేవుడా అని నిట్టూర్చాను.

రాత్రి భోజనాలయ్యాక లవంగం నములుతూ..

"ఏవోయ్ రేపు శనివారం (శనివారాన్ని హానీబార్ అంటారు. సోమవారాన్ని హోమబార్ అంటారు. 'వ'ని 'బ'గా ఉచ్చరిస్తారు) గుడికి వెళ్దాం" అన్నారు.

"గుడికి వెళ్దాం కానీ అక్కడ అర్చన చేయించాక పూజారి గారికి దక్షిణ ఇవ్వకూడదు" చెప్పాను.

"అదేం" అన్నారు ఆశ్చర్యపోతూ.

"అదంతే" నిశ్చయంగా చెప్పాను.

"కారణం చెప్పాలోయ్" మురిపెంగా అడిగారు.

"కారణం అంటే, మీరు దక్షిణ ఇచ్చిన తర్వాత ఆయన 'శతమానం భవతి' అంటాడుగా""సోవాట్"

"సోవాట్ ఏమిటి నా ముఖం. శతమానం భవతి బదులు 'హతమానం భవతి' అంటాడని నా భయం" బేలగా బదులు చెప్పిన నన్ను చూసి మరి మాట్లాడలేక శ్రీవారు నిద్రకుపక్రమించారు.

**-ఆదిరాజు సాయి మారుతి (గౌహతి)**